# తెలంగాణ వెన్నెల వాక్కు

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU

TGTEL/25/A0871

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక :357 శుక్రవారం 03-07- 2026 పేజీలు: 4 వెల రూ. 03



తెలంగాణ వెన్నెల వాక్కు విలేకరులు కావలెను

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో


# ఎలా సర్..?

## ఓటు హక్కుతో చెలగాటమా..?

### నిర్మల్ జిల్లాలో 'సర్' ప్రక్రియపై ప్రజల ఆగ్రహం.. ఫారాలు పంచి చేతులు దులుపుకున్న బీఎల్ఓలు..!



నిర్మల్ జూలై 2 తెలంగాణ వెన్నెల వాక్కు

ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమైన ఓటు హక్కును మరింత పారదర్శకంగా చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఆర్) ప్రక్రియ నిర్మల్ జిల్లాలో తీవ్ర గందరగోళానికి దారితీసింది. ఓటర్లకు అవగాహన కల్పించి, ప్రతి వివరాన్ని సక్రమంగా నమోదు చేయించాల్సిన బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) అనేక గ్రామాల్లో కేవలం ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసి వెళ్లిపోతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఆందోళన, అయోమయంలో పడిపోయారు.

నిర్మల్ జిల్లాలోని నిర్మల్, ముధోల్, ఖానాపూర్ (ఎస్టీ) నియోజకవర్గాల పరిధిలో 18 మండలాలు, వందలాది గ్రామాలు, సుమారు 7.37 లక్షల మంది ఓటర్లు ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగమయ్యారు. అయితే ఇంత పెద్ద కార్యక్రమానికి తగిన అవగాహన కార్యక్రమాలు నిర్వహించకపోవడం వల్ల గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎన్యుమరేషన్ ఫారాల్లో క్యూఆర్ కోడ్, కుటుంబ సభ్యుల వివరాలు, జనన తేదీలు, బంధుత్వం, పాత ఓటరు వివరాలు, చిరునామా, అవసరమైన పత్రాల జాబితా వంటి అనేక అంశాలు ఉండటంతో చదువుకున్న వారికే వాటిని సక్రమంగా నింపడం కష్టంగా మారింది. నిరక్షరాస్యులు, వృద్ధులు, గిరిజన ప్రాంతాల ప్రజల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఫారంలో చిన్న పొరపాటు జరిగినా తమ ఓటు హక్కు ప్రమాదంలో పడుతుందేమోనని ప్రజలు భయపడుతున్నారు. ముఖ్యంగా 2002 నాటి ఓటర్ల జాబితాలోని వివరాలను నమోదు చేయాల్సి రావడం మరింత గందరగోళానికి కారణమైంది. ఆ జాబితా ప్రజలకు అందుబాటులో లేకపోవడం, 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనతో పాత పోలింగ్ కేంద్రాలు, భాగం సంఖ్యలు మారిపోవడం వల్ల ఏ వివరాలు నమోదు చేయాలో ప్రజలకు అర్థం కావడం లేదు. ఈ సందేహాలను నివృత్తి చేయాల్సిన బీఎల్ఓలు కూడా చాలాచోట్ల సరైన వివరణ ఇవ్వకుండానే వెళ్లిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రతి ఇంటికి వెళ్లి ఫారాలు నింపించాల్సిన బాధ్యతను నిర్వర్తించకుండా, "ఫారం ఇచ్చాం... నింపి ఇవ్వండి" అనే ధోరణితో వ్యవహరించడం అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు మండిపడుతున్నారు. గ్రామాల్లో సహాయ కేంద్రాలు లేకపోవడం, ప్రత్యేక అవగాహన సమావేశాలు నిర్వహించకపోవడం, ఇతర శాఖల సిబ్బంది సహకారం లేకపోవడం వల్ల బీఎల్ఓలపై పనిభారం పెరిగినప్పటికీ, ఆ భారం చివరకు సామాన్య ఓటరిపైనే పడుతోంది.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు పవిత్రమైన రాజ్యాంగ హక్కు. అలాంటి హక్కును రక్షించాల్సిన ప్రక్రియనే ప్రజలకు భయాందోళన కలిగించే విధంగా అమలు చేయడం పట్ల జిల్లా వ్యాప్తంగా అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలంటే ప్రతి గ్రామంలో ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహించడం, బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఫారాలు స్వయంగా నింపించి స్వీకరించడం, సందేహాలకు వెంటనే సమాధానాలు ఇవ్వడం అత్యవసరం. లేనిపక్షంలో అవగాహన లోపంతో వేలాది మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని నిర్మల్ జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# రైతుల గుండెల్లో డీఏపీ 'ఘాటు'..

## .నల్లబజారుకు నిల్వలు.. అడ్డగోలు ధరలతో దోపిడీ!

## ఎమ్మార్పీ ధర రూ.1350.. అమ్మేది రూ.1700:

నిర్మల్ జూలై 2 తెలంగాణ వెన్నెల వాక్కు

వానాకాలం సాగు ఊపందుకుంటున్న తరుణంలో నిర్మల్ జిల్లా వ్యాప్తంగా రైతులకు అత్యంత ఆవశ్యకమైన ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. కంపెనీల నుంచి ఆశించిన మేర సరఫరా లేకపోవడంతో జిల్లాలో ఎరువుల లభ్యత పడిపోయింది. ఇదే అదనుగా భావించిన కొంతమంది హోల్‌సేల్ డీలర్లు కృత్రిమ కొరతను సృష్టించి అడ్డగోలు ధరలకు విక్రయాలు సాగిస్తున్నారు. ప్రధానంగా పంటలకు ప్రాథమిక దశలో అవసరమయ్యే డీఏపీ ఎరువులు మార్కెట్లో దొరకకుండా పోవడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు వర్షాలు విస్తరించి సాగు పనులు వేగవంతం అవుతుంటే, మరోవైపు ఎరువుల కొనుగోలు కోసం రైతులు దుకాణాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్కెట్లో ఉన్న కొద్దిపాటి నిల్వలను కూడా అక్రమ నిల్వలుగా మార్చి, గరిష్ట విక్రయ ధర (ఎమ్మార్పీ) కంటే అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.




**డీఏపీ మాయం.. ప్రత్యామ్నాయ ఎరువులపైనా అడ్డగోలు దోపిడీ!**

డీఏపీ ఎరువులు మార్కెట్లో ఏమాత్రం అందుబాటులో లేకపోవడంతో జిల్లాలోని రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా మిశ్రమ (కాంప్లెక్స్) ఎరువుల వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ముడిసరుకుల ధరలు పెరగడంతో దేశవ్యాప్తంగా ఎరువుల ఉత్పత్తి తగ్గిందని తెలుస్తోంది. దీనివల్ల మార్కెట్లో 20-20-0-13 మరియు 28-28-0 వంటి మిశ్రమ ఎరువుల ధరలు కూడా అమాంతం పెరిగాయి. ప్రస్తుత తరుణంలో ఒక్కో మిశ్రమ ఎరువుల బస్తా ధర రూ. 1,850 వరకు పలుకుతుండటంతో సాధారణ, మధ్యతరగతి రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకవైపు విత్తనాల ధరలు, ఎడ్ల కూలీలు, యంత్రాల అద్దెలు పెరిగి పెట్టుబడి భారం భారంగా మారిన తరుణంలో, ఎరువుల కోసం అదనంగా వేల రూపాయలు ఖర్చు చేయాల్సి రావడం రైతులను కోలుకోలేని దెబ్బ తీస్తోంది. ధరలు పెరిగినా పంటను కాపాడుకోవడానికి తప్పనిసరిగా కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**రశీదులొకటి.. అమ్మకాలొకటి..హోల్‌సేల్ దందాకు చిన్న వ్యాపారుల బలి!**

ఎరువుల కృత్రిమ కొరత వెనుక హోల్‌సేల్ వ్యాపారుల హస్తం స్పష్టంగా కనిపిస్తోంది. డీఏపీ అసలు గరిష్ట ధర రూ. 1,350 ఉన్నప్పటికీ, వారు రిటైల్ (చిల్లర) వ్యాపారులకు రూ. 1,600 నుండి రూ. 1,700 వరకు విక్రయిస్తున్నారు. అయితే రశీదులు (బిల్లులు) మాత్రం కేవలం అధికారిక ధరకే ఇస్తుండటంతో, గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న వ్యాపారులు ఆ ధరలకు కొనుగోలు చేయడానికి వెనకాడుతున్నారు. తాము హోల్‌సేల్ నుంచి ఎక్కువ ధరకు తెచ్చి గ్రామాల్లో గరిష్ట ధర కంటే ఎక్కువకు అమ్మితే రైతుల నుంచి నిరసనలు వస్తాయని, అధికారులు చర్యలు తీసుకుంటారని చిన్న వ్యాపారులు భయపడుతున్నారు. దీనివల్ల పట్టణ ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు ఎరువుల సరఫరా పూర్తిగా నిలిచిపోయి, పల్లెల్లో ఎరువుల కొరత మరింత జటిలంగా మారింది. అవసరాన్ని బట్టి కొందరు రైతులు నల్లబజారులో ఎక్కువ ధర పెట్టి కొంటున్నా, రశీదులు లభించకపోవడం గమనార్హం.

**నిమ్మకు నీరెత్తిన అధికారులు.. ప్రభుత్వ కేంద్రాల ద్వారానే పంపిణీ చేయాలని డిమాండ్!**

జిల్లాలో ఇంతపెద్ద ఎత్తున ఎరువుల అక్రమ విక్రయాలు జరుగుతున్నా వ్యవసాయ శాఖ అధికారులు కనీస తనిఖీలు చేపట్టడం లేదని రైతు సంఘాల నాయకులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. హోల్‌సేల్ డీలర్లు ఒక టన్ను ఎరువులపై వేల రూపాయల అదనపు లాభాలు అర్జిస్తున్నా, నిఘా పెట్టాల్సిన విభాగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దోపిడీని అరికట్టడానికి వ్యవసాయ అధికారులు వెంటనే స్పందించి ప్రైవేట్ దుకాణాలపై దాడులు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలోని ఎరువుల నిల్వలను వంద శాతం ప్రైవేట్ వ్యక్తులకు కాకుండా మార్క్‌ఫెడ్, పీఏసీఎస్ లేదా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారానే నేరుగా అర్హులైన రైతులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గరిష్ట ధర కంటే ఎక్కువ ధరకు విక్రయించే డీలర్ల అనుమతి పత్రాలను (లైసెన్సులను) రద్దు చేసి, నల్లబజారు విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని నిర్మల్ జిల్లా రైతాంగం ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేస్తోంది.

# కల్వకుంట్ల కవితను బండ రాళ్లపై పడేసి, కారు డోరుకేసి గుద్ది!

హైదరాబాద్ బ్యూరో

టీఆర్ఎస్ ముఖ్య నాయకురాలు కల్వకుంట్ల కవిత అరెస్ట్ ఉదంతం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకుని తరలిస్తున్న సమయంలో ఊహించని విధంగా పెద్ద ఎత్తున తోపులాట జరిగింది. ఈ క్రమంలో పోలీసులు వ్యవహరించిన తీరు, భద్రతా లోపాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. అరెస్ట్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఆమెను వాహనంలోకి ఎక్కించే క్రమంలో చోటుచేసుకున్న గందరగోళ పరిస్థితులు, తోపులాటల వల్ల కవితకు తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. అక్కడ ఉన్న కార్యకర్తలు, పోలీసుల మధ్య జరిగిన ఘర్షణ వాతావరణం కారణంగా పరిస్థితి పూర్తిగా చేజారిపోయింది.

ఆమెను పోలీసులు బలవంతంగా చేతులపై అమాంతం ఎత్తుకెళ్తున్నప్పుడు జరిగిన తోపులాటలో కవిత ఒక్కసారిగా కింద పడిపోయారు. ఆ ప్రాంతంలో ఉన్న పెద్ద పెద్ద బండరాళ్లపై కవితను కుదేసినట్టుగా కింద పడేయడంతో అక్కడున్న వారంతా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. తోపులాట తాకిడి ఎంత తీవ్రంగా ఉందంటే, నియంత్రించలేని పరిస్థితుల్లో పోలీసులు సైతం ఆమెపైనే పడ్డారు. బండరాళ్లపై పడటం, పైగా పోలీసులు కూడా ఆమె మీద పడటంతో కవితకు శరీర భాగాలపై తీవ్రమైన గాయాలయ్యాయి. ఈ పరిణామంతో అక్కడున్న టీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. అయినప్పటికీ పోలీసులు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా, గాయపడిన కవితను మళ్లీ అక్కడి నుంచి పోలీసు కారు వరకు చేతులపైనే ఎత్తుకెళ్లారు. అయితే ఈ రెండోసారి తరలింపు ప్రక్రియలోనూ కనీస భద్రతా ప్రమాణాలు పాటించలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



విపరీతమైన తోపులాట జరుగుతున్నప్పటికీ ఆమెకు రక్షణగా నిలవడంలో రక్షణ సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారు. దీనివల్ల కారుకు సమీపంలోకి రాగానే ఒక్కసారిగా నెట్టివేసినట్లయి, కవిత కారు డోరుకు బలంగా ఢీకొన్నారు. కారు తలుపులకు గట్టిగా గుద్దుకోవడంతో ఆమెకు ఇక్కడా తీవ్రంగా గాయాలయ్యాయి.

ఒక మహిళా నాయకురాలిని అరెస్ట్ చేసి తీసుకెళ్లే సమయంలో మహిళా పోలీసుల రక్షణ వలయం సరిగ్గా లేకపోవడం, కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తీవ్ర ఉద్రిక్తతల మధ్య, గాయాలతోనే పోలీసులు ఆమెను వాహనంలో ఎక్కించి అక్కడి నుంచి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, కవిత ఆరోగ్య పరిస్థితిపై మరింత సమాచారం అందాల్సి ఉంది.

రాజకీయ రంగంలో ఇటువంటి ఘటనలు తీవ్ర సంచలనం సృష్టిస్తాయి. శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అరెస్టయిన నేతలకు కనీస భద్రత కల్పించడం అత్యంత అవసరం. భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఉండటానికి ప్రభుత్వం మరియు పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ప్రభుత్వ టీచర్లు, సిబ్బందికి కేబినెట్ తీపికబురు:

## ఇక విద్యార్థులతో పాటే ఉచిత మధ్యాహ్న భోజనం!




హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి ప్రభుత్వం సరికొత్త ఉగాది కానుకను ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రాష్ట్ర తొలి 'ఈ-కేబినెట్' (వ-ఝుఎఱఅవ్) సమావేశంలో విద్యా రంగానికి సంబంధించి ఒక చారిత్రాత్మక నిర్ణయానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇకపై రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో పాటు పనిచేసే ఉపాధ్యాయులు, లెక్చరర్లు మరియు నాన్-టీచింగ్ స్టాఫ్ అందరికీ ఉచితంగా మధ్యాహ్న భోజనం అందించాలని కేబినెట్ తొలి నిర్ణయంగా తీర్మానించింది. ప్రభుత్వ తీసుకున్న ఈ అసాధారణ నిర్ణయం విద్యా రంగంలో సరికొత్త మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది.

ఇప్పటివరకు అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం ప్రభుత్వ పాఠశాలలు మరియు కళాశాలల్లో కేవలం విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్న భోజన పథకం అమలు అవుతోంది. విధుల్లో ఉండే ఉపాధ్యాయులు, సిబ్బంది తమ భోజనాన్ని సొంతంగా ఇంటి నుంచే తెచ్చుకోవాల్సి వచ్చేది. లేదా మధ్యాహ్న విరామ సమయంలో బయటకు వెళ్లాల్సి వచ్చేది. అయితే, సుదూర ప్రాంతాల నుంచి పాఠశాలలకు వచ్చే ఉపాధ్యాయులు ఉదయాన్నే భోజనం బాక్సులు సిద్ధం చేసుకోవడంలో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన రేవంత్ రెడ్డి సర్కార్, ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా ఈ సరికొత్త విధానాన్ని తెరపైకి తెచ్చింది. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది ప్రభుత్వ టీచర్లు, సిబ్బందికి పెద్ద ఊరట లభించనుంది.

## జౌళి ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్



సారంగాపూర్, జూలై 02 (తెలంగాణ వెన్నెల వాక్కు):
సారంగాపూర్ మండల పరిధిలోని జౌళి గ్రామంలో గల మండల ప్రాథమిక పాఠశాలను ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాకేష్ కుమార్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో నేరుగా ముఖాముఖి మాట్లాడారు. ఉపాధ్యాయుల విద్యాబోధన విధానాన్ని, పిల్లల అభ్యాస నైపుణ్యాలను పరిశీలించేందుకు స్వయంగా పాఠశాల విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. విద్యార్థులు చురుగ్గా సమాధానాలు చెప్పడం పట్ల ఆయన ప్రత్యేక హర్షం వ్యక్తం చేస్తూ, బాగా చదువుకుంటున్నారని పిల్లలను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాలలో మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన నిర్వహణను కూడా పరిశీలించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీకాంత్, ఎంఈఓ మహేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూమేష్, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంచెట్టి గంగాధర్ కు ఘన సన్మానం



ఆర్మూర్, జూలై 02 (తెలంగాణ వెన్నెల వాక్కు):
భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నూతనంగా నియమితులైన కంచెట్టి గంగాధర్ కు గురువారం పట్టణంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆలూరు మున్సిపల్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పార్టీలో గంగాధర్ అందించిన సేవలను గుర్తించి అధిష్టానం ఆయనకు ఈ కీలక బాధ్యతలను అప్పగించిందని ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు. నూతన పదవిని స్వీకరించిన గంగాధర్ ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో కల్లెడ గ్రామ సర్పంచ్ ప్రళయ్ తేజ్ తో పాటు బీజేపీ, బీజేవైఎం ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలల్లో పార్ట్ టైం ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్, జూలై 2 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న పార్ట్ టైం ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి ఆర్ ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని లక్ష్మణ్‌చందా (లెఫ్ట్ పోచంపాడ్), జామ్, కడెం, భైంసా బాలికల గురుకులాలు, మహిళా డిగ్రీ కళాశాలల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. ఇందులో తెలుగు, ఇంగ్లీష్, కెమిస్ట్రీ జేఎల్ పోస్టులు, పీజీటీ, హిందీ టీజీటీ, మ్యాథ్స్, బయోసైన్స్, ఫిజికల్ సైన్స్ పీజీటీ పోస్టులతో పాటు పీడీ, పీఈటీ, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్, లైబ్రేరియన్, డిగ్రీ కాలేజీ బాటనీ, కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, కంప్యూటర్ సైన్స్ లెక్చరర్ పోస్టులు ఉన్నాయన్నారు. డిగ్రీ లెక్చరర్ పోస్టులకు నెట్, సెట్ లేదా పీహెచ్‌డీ, జేఎల్, పీజీటీ పోస్టులకు పీజీతో పాటు బీఎడ్, టీజీటీ పోస్టులకు డిగ్రీతో పాటు బీఎడ్ అర్హత కలిగి ఉండాలన్నారు. కేవలం మహిళా అభ్యర్థులు మాత్రమే ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జూలై 4వ తేదీ నుండి జూలై 9వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 4:30 గంటల లోపు లెఫ్ట్ పోచంపాడ్ గురుకుల పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు జూలై 10న ఉదయం 10:30 గంటలకు నిర్మల్ లోని సోఫినగర్ గురుకుల డిగ్రీ కళాశాలలో జరిగే డెమోకు హాజరుకావాలని సూచించారు.

## నిర్మల్ జిల్లాలో సదరం క్యాంపుల నిర్వహణ తేదీల విడుదల

నిర్మల్, జూలై 2 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యములో మీ సేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని, మొబైల్ ఫోన్లకు సమాచారం అందిన దివ్యాంగుల కొరకు నిర్మల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహించనున్న సదరం శిబిరాల తేదీల వివరాలను అధికారులు గురువారం అధికారికంగా విడుదల చేశారు. ఆయా వైకల్యాలు గల అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీల్లో ఉదయం 9:00 గంటలకు ఆసుపత్రికి హాజరుకావాలని సూచించారు. వైకల్యాల వారీగా క్యాంపుల నిర్వహణ వివరాలు ఇలా ఉన్నాయి. కంటి వైకల్యం (లో విజన్) గల వారికి జూలై 3, జూలై 10, జూలై 21, జూలై 28 తేదీలలో శిబిరాలు నిర్వహిస్తారు. బుద్ధిమాంద్యం, మానసిక వైకల్యం గల వారికి జూలై 7వ తేదీన, వినికిడి లోపం గల వారికి జూలై 23వ తేదీన క్యాంపులు ఉంటాయి. అలాగే ఆర్థోపెడిక్ అంగవైకల్యం, పక్షవాతం గల వారి కొరకు జూలై 9, జూలై 14, జూలై 16, జూలై 22, జూలై 30వ తేదీలలో నిర్మల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నందు ప్రత్యేక సదరం శిబిరాలను నిర్వహించనున్నారు. కావున సదరం శిబిరాలకు హాజరగువారు మీ సేవ సదరం స్లాట్ బుకింగ్ రసీదు, ఆధార్ కార్డు జిరాక్స్, కాలపరిమితి ముగిసిన పాత సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు జిరాక్స్, కొత్త పాస్‌పోర్ట్ సైజు ఫోటో ఖచ్చితంగా వెంట తీసుకొని రావలసి ఉంటుంది. కంటి వైకల్య దివ్యాంగులు హైదరాబాద్ లోని సరోజినీ దేవి లేదా ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ ఒరిజినల్ రిపోర్టులు, చెవిటి మూగ దివ్యాంగులు కోటి ఈఎన్‌టీ ప్రభుత్వ ఆసుపత్రి బెరా రిపోర్టులు, మానసిక వైకల్యం గలవారు సికింద్రాబాద్ బోయినపల్లి మెంటల్ హాస్పిటల్ ఐక్యూ అసెస్మెంట్ రిపోర్టులు, ఆర్థోపెడిక్ వైకల్యం గలవారు ఎక్స్-రే రిపోర్టులు, పక్షవాతం గలవారు కొత్త ఎమ్మారై లేదా సీటీ స్కానింగ్ ఒరిజినల్ రిపోర్టులతో పాటు మీ సేవలో ఇచ్చిన మొబైల్ నెంబరును వెంట తీసుకొని ఆయా తేదీలలో హాజరుకావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారు ఒక ప్రకటనలో కోరారు.

## ఏజెన్సీ నియోజకవర్గాలకు అదనంగా 2 వేల ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వండ

### సీఎం రేవంత్ రెడ్డికి గిరిజన ఎమ్మెల్యేల వినతి



హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలోని ఏజెన్సీ (ఆదివాసీ, గిరిజన) ప్రాంతాల్లో ఉన్న శాసనసభ నియోజకవర్గాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఆయా నియోజకవర్గాలకు అదనంగా మరో రెండు వేల ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని గిరిజన ప్రాంత శాసనసభ్యులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క గారి నేతృత్వంలో ఆదివాసీ, గిరిజన శాసనసభ్యుల ఉన్నత స్థాయి బృందం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారిని ప్రత్యేకంగా కలిసింది. ఏజెన్సీ ప్రాంతాల్లోని నిరుపేద గిరిజనుల ఇండ్ల అవసరాలను తీర్చేందుకు అదనపు కోటా మంజూరు చేయాలని కోరుతూ ఈ బృందం ముఖ్యమంత్రికి ఒక అధికారిక వినతిపత్రాన్ని అందజేసింది.
ఈ సమావేశంలో గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధి, ఐటీడీఏల పరిధిలోని సమస్యలు మరియు గిరిజన సంక్షేమ పథకాల అమలుపై ముఖ్యమంత్రితో ఈ బృందం సుదీర్ఘంగా చర్చించింది. ఏజెన్సీ పరిధిలోని అడవులపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీలకు న్యాయం జరిగేలా, అక్కడి పోడు భూములకు తక్షణమే పట్టాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని గిరిజన ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రిని కోరారు. దీనితో పాటు గిరిజన రైతులకు సాగునీటి వసతి కల్పించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడేలా అత్యంత ప్రతిష్టాత్మకమైన 'ఇందిర గిరి జల వికాసం' పథకాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, ఉపాధి అవకాశాలను

## సివిల్స్ ఉచిత కోచింగ్ కొరకు ఎస్సీ స్టడీ సర్కిల్ దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ కలెక్టరేట్, జూలై 2 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తెలంగాణ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ అందించుటకు అర్హులైన అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి డిగ్రీ ఉత్తీర్ణులై, తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన అభ్యర్థులు, దివ్యాంగులు దరఖాస్తుకు అర్హులన్నారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం 3 లక్షల రూపాయల కంటే ఎక్కువ ఉండకూడదన్నారు. ఇది పూర్తి సమయం రెసిడెన్షియల్ కోర్సు కావున అభ్యర్థులు ఎలాంటి ఉద్యోగాలు గానీ, ఇతర కోర్సులు గానీ చదవకూడదన్నారు. గతంలో స్టడీ సర్కిల్ ద్వారా కోచింగ్ పొందిన వారు అర్హులు కారు. ఈ ఉచిత కోచింగ్ కాలపరిమితి ఆగస్టు 2026 నుండి మే 2027 వరకు లేదా సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జూలై 12వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు అధికారిక ఫోన్ నెంబర్లను సంప్రదించాలని జిల్లా అధికారి కోరారు.

## దిలావర్‌పూర్‌లో మల్కిత్ హార్వెస్టర్ కంపెనీ సీఈఓ పర్యటన



దిలావర్‌పూర్, జూలై 2 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కేంద్రంలో ప్రముఖ అగ్రి టెక్నాలజీ సంస్థ 'మల్కిత్ కంపెనీ' హార్వెస్టర్ల ముఖ్య నిర్వహణాధికారి (సీఈఓ) గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక డీలర్లు, రైతులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. వారు నూతనంగా మార్కెట్లోకి ప్రవేశపెట్టిన అత్యాధునిక సాంకేతికతతో కూడిన మల్కిత్ హార్వెస్టర్ల పనితీరును వివరించారు. వ్యవసాయ రంగంలో రైతులకు మేలు చేయడంలోనూ, పంట నూర్పిడి సమయంలో గింజలు వృధా కాకుండా పంట నష్టాన్ని నివారించడంలో ఈ సరికొత్త హార్వెస్టర్లు దేశంలోనే ముందు వరుసలో ఉన్నాయని పేర్కొన్నారు. ఆధునిక యంత్రాల వినియోగం వల్ల రైతులకు సమయం, పెట్టుబడి కలిసి వస్తుందన్నారు. ఈ క్షేత్రస్థాయి పర్యటన కార్యక్రమంలో మల్కిత్ హార్వెస్టర్ స్థానిక డీలర్లతో పాటు సమీరుద్దీన్, నటరాజ్, వసీం, అమీర్, జాకీర్, నవీన్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# మణిపూర్ రక్తాపాతం

## -- పాలకుల నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యం



మణిపూర్ రాష్ట్రంలో గత మూడేళ్లుగా సాగుతున్న అమానుష రక్తాపాతం, అదుపులేని జాతి వివక్ష ఈ దేశ ప్రజాస్వామ్యానికే ఒక పెద్ద మచ్చగా మారాయి. ఒకే రాష్ట్రంలో దశాబ్దాలుగా కలిసి నివసించే ప్రజలు నేడు తమ భౌగోళిక సరిహద్దులను బట్టి విడిపోయి, ఒకరినొకరు బద్ధ శత్రువులుగా చూసుకుంటూ ప్రాణాలు తీసుకుంటుంటే, దేశాన్ని ఏలుతున్న కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తోందనే ప్రశ్న ప్రతి ఒక్కరి గుండెల్లో రగులుతోంది. ఇది కేవలం రెండు వర్గాల మధ్య జరిగిన ఒక సాధారణ అంతర్గత ఘర్షణ కాదు; వ్యవస్థల పూర్తి వైఫల్యం, అధికార పీఠాల ఉదాసీనత వల్ల పుట్టుకొచ్చిన ఒక భయంకరమైన మానవ నిర్మిత విపత్తు. ఒక సున్నితమైన సరిహద్దు రాష్ట్రంలో ఇంతటి దారుణం జరుగుతున్నా కేంద్రం తీసుకుంటున్న చర్యలు శూన్యమనే విమర్శలు రావడం పాలకుల అసమర్థతను ఎత్తిచూపుతోంది.
మొదట్లో ఈ ఘర్షణలు కేవలం ఇంఫాల్ లోయ ప్రాంతంలో కేంద్రీకృతమైన మైతీ వర్గానికి, చుట్టుపక్కల ఉన్న కొండ ప్రాంతాలలోని కూకీ-జో తెగలకు మధ్య మాత్రమే పరిమితమై ఉండేవి. కానీ కాలక్రమేణా ఎత్తైన పర్వతాలలో నివసించే నాగా వర్గం కూడా ఈ హింసలోకి లాగబడటంతో సమస్య మరింత జటిలమైంది. చిన్న చిన్న గొడవలు కాస్తా చివరకు పరస్పర అపహరణలు, బందీల రాజకీయాలు, మరియు నడిరోడ్డుపై పాస్టర్లను, సామాన్య గ్రామస్తులను నరికి చంపేంత క్రూరత్వానికి దారితీశాయి. కూకీల ఆధీనంలో ఉన్న ఆరుగురు నాగా బందీలను అత్యంత అమానుషంగా చంపి అడవుల్లో పడేసిన ఉదంతం ఇక్కడి పగ ఏ స్థాయికి చేరిందో స్పష్టం చేస్తోంది. ఇవన్నీ కళ్లముందు జరుగుతున్నా దేశ రక్షణను, అంతర్గత భద్రతను పర్యవేక్షించాల్సిన కేంద్ర ప్రభుత్వం కేవలం మూగప్రేక్షకుడిలా ఉండిపోవడం అత్యంత శోచనీయం.
ఇలాంటి భయానక పరిస్థితుల్లో కేంద్రం తన బాధ్యత నుండి ఎంతమాత్రం తప్పించుకోలేదు. కేవలం వేలాది మంది సైనిక బలగాలను, సీఆర్పీఎఫ్ దళాలను మోహరించినంత మాత్రాన సరిపోదని క్షేత్రస్థాయి పరిస్థితులు నిరూపిస్తున్నాయి. అక్కడ హింస ఆగకపోవడానికి కారణం కేంద్ర నిఘా వర్గాల పూర్తి వైఫల్యమే. మణిపూర్ లాంటి సున్నితమైన సరిహద్దు రాష్ట్రంలోకి అత్యాధునిక ఆయుధాలు, దారుణమైన తుపాకులు ఎలా వస్తున్నాయి? సరిహద్దుల గుండా జరుగుతున్న ఆయుధాల అక్రమ రవాణాన్ని కేంద్రం ఎందుకు అడ్డుకోలేకపోతోంది? ఒక పక్కన అమాయక ప్రజలు, మహిళలు, చిన్న పిల్లలు నిత్యావసర వస్తువులు దొరకక, ప్రాణభయంతో సురక్షిత ప్రాంతాలకు వలసపోతుంటే, కేంద్రం కేవలం కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందనేది పచ్చి నిజం. ఆ కమిటీలు కూడా ఇరు వర్గాల మధ్య నమ్మకాన్ని పూరించడంలో ఘోరంగా విఫలమయ్యాయి.
ఈ సంక్షోభం వెనుక ఉన్న భౌగోళిక అసమానతలను, ప్రాంతీయ అభివృద్ధి లోపాలను సరిదిద్దడంలో కేంద్రం ఎప్పుడూ దూరదృష్టితో ఆలోచించలేదు. రాజకీయ నాయకులు తమ ఓటు బ్యాంక్ స్థిరపరుచుకోవడం కోసం ఈ జాతి వివక్షను, ప్రాంతీయ పగలను మరింత పెంచి పోషిస్తున్నారు. ఎన్నికల ప్రచారాల్లో కనబరిచే ఉత్సాహం, దేశంలోని ఒక రాష్ట్రం తగలబడిపోతుంటే పరిష్కారం చూపించడంలో ఎందుకు కనిపించడం లేదని సామాన్య ప్రజలు నేడు పాలకులను నిలదీస్తున్నారు. మైతీలు లోయకే పరిమితమై, నాగాలు కొండలపై ఉండిపోయి, కూకీలు వీరిద్దరి మధ్య నలిగిపోతూ భౌగోళిక బంధీలుగా మారిన ఈ దుస్థితికి పాలకుల అసమర్థతే కారణం. జాతి వివక్ష అనేది ఒక నవసమాజాన్ని లోపలి నుండి తినేసే మహమ్మారి లాంటిది. మణిపూర్‌లో నేడు మనుషుల మధ్య గోడలు బద్దలైపోయాయి, మానవత్వం మరియు ఒకరిపై ఒకరికి ఉన్న నమ్మకం పూర్తిగా చచ్చిపోయింది. ఒక వర్గం నివసించే ప్రాంతంలోకి మరో వర్గం అడుగుపెట్టడమే మరణశాసనంగా మారిన ఈ తరుణంలో పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సమంజసం కాదు. బలగాల మోహరింపుతో తాత్కాలికంగా అణచివేయడం కాదు, ఢిల్లీ వేదికగా అన్ని వర్గాల ప్రతినిధులను ఒకే తాటిపైకి తెచ్చి, కఠినమైన రాజకీయ నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. దేశ సార్వభౌమాధికారానికి సవాలు విసురుతున్న ఇటువంటి శక్తులపై ఉక్కుపాదం మోపకపోతే వ్యవస్థలు కూలిపోతాయి.
సరిహద్దు రాష్ట్రంలో నెలకొన్న ఈ అస్థిరత కేవలం మణిపూర్‌కే పరిమితం కాదు, ఇది దేశ సమగ్రతకే ముప్పు తెచ్చే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఓటు బ్యాంక్ మరియు స్వార్థ రాజకీయాలను పక్కన పెట్టాలి. బాధితులకు తగిన న్యాయం చేస్తూ, ఆయుధాలు పట్టిన ముఠాలపై ఉక్కుపాదం మోపాలి. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చందంగా కాకుండా, అత్యున్నత అధికార యంత్రాంగం నేరుగా రంగంలోకి దిగి మణిపూర్ గడ్డపై శాంతిని పునరుద్ధరించకపోతే, చరిత్ర పాలకుల నిర్లక్ష్యాన్ని ఎన్నటికీ క్షమించదు. ఒక దేశ ప్రగతి దాని సరిహద్దుల భద్రతపై, ప్రజల ఐక్యతపై ఆధారపడి ఉంటుంది. మణిపూర్ రగులుతున్నంత కాలం భారతదేశ కీర్తి ప్రతిష్ఠలు అంతర్జాతీయంగా దెబ్బతింటూనే ఉంటాయి. కాబట్టి, కేంద్ర ప్రభుత్వం ఇకనైనా నిద్ర వీడి తక్షణమే శాశ్వత పరిష్కారాన్ని చూపించాలి.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
9848559863

## సానుకూల ఆలోచనలను ఉత్తేజపరిచేవి భజనలే: ఆలయ కమిటీ

వేల్పూర్, జూలై 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): భజన కీర్తనలు పాడడం లేదా వినడం వల్ల మనస్సుకు ప్రశాంతత చేకూరి ఒత్తిడి తగ్గుతుందని, ఇవి ఆధ్యాత్మిక భావనను పెంపొందించి సానుకూల ఆలోచనలను ఉత్తేజపరుస్తాయని అవధూత గోవిందగిరి దివ్య యోగాశ్రమ ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. వేల్పూర్ లోని ఆశ్రమంలో గురువారం భజన భక్త బృందాల ఆధ్వర్యంలో చక్కటి భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వారం అంక్సాపూర్ గ్రామానికి చెందిన భట్టాపూర్ లక్ష్మి శ్రీనివాస్ గౌడ్ (ఆర్టీసీ కండక్టర్) దంపతులు అన్నదాతలుగా వ్యవహరించారు.



ధ్యాన మందిరం నుండి భక్తులు మంగళహారతులు చేబూని పల్లకి సేవ నిర్వహించగా, మహిళలు, భజన బృందాలు లయబద్ధమైన కీర్తనలతో ఆనందోత్సాహాల మధ్య నృత్యాలు చేశారు. భజనల ద్వారా వెలువడే దివ్యమైన ప్రకంపనలు ప్రతికూలతలను దూరం చేస్తాయని, సామూహికంగా భజనలు చేయడం వలన ప్రజల మధ్య ఐక్యత పెంపొందుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

## నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎస్‌బీఐ బ్యాంక్ చేయూత

నిర్మల్ టౌన్, జూలై 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిర్మల్ తన్వీ బ్రాంచ్ యాజమాన్యం సామాజిక బాధ్యతలో భాగంగా విలువైన నాలుగు లాంజ్ చైర్లను విరాళంగా అందజేసింది. గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో




ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ రవి మాలోత్, సీనియర్ అసోసియేట్ పుప్పాల శేఖర్ హాజరై, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం. సుధాకర్‌కు ఈ చైర్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, విద్యార్థుల అవసరాలను గుర్తించి ఎస్‌బీఐ బ్యాంక్ వారు ముందుకొచ్చి ఈ చైర్లను విరాళంగా ఇవ్వడం ఎంతో అభినందనీయమన్నారు. బ్రాంచ్ మేనేజర్ రవి మాలోత్ మాట్లాడుతూ, విద్యా సంస్థలకు చేయూతనివ్వడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని, భవిష్యత్తులోనూ కళాశాలకు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ నాగ శ్రీనివాస్, అధ్యాపకులు డాక్టర్ పీజీ రెడ్డి, డాక్టర్ హేమలత, కుంటా శ్రీహరి పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు

ఆర్మూర్, జూలై 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆర్మూర్ పట్టణంలో 'మన కాలనీ -- మన భద్రత, మన బాధ్యత' అనే కార్యక్రమంలో భాగంగా శ్రీ చైతన్య హైస్కూల్ లో విద్యార్థులకు మత్తు పదార్థాల నిర్మూలన, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్మూర్ సబ్ ఇన్స్పెక్టర్ రజినీకాంత్ విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రత గురించి వివరించారు. యువత మత్తు పదార్థాలకు (డ్రగ్స్) దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ పెట్టాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.




నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్రను, మహిళల రక్షణ కోసం పనిచేస్తున్న షీ టీమ్స్ సేవల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆదిత్య పరశ్రీ స్వామీజీతో సంగు మహారాజ్ ఆధ్యాత్మిక చర్చలు

ఆర్మూర్, జూలై 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): నారాయణపేట జిల్లా మక్తల్ మండలం బిజ్వార్ గ్రామం సమీపంలో గల జగన్మాత అంబాత్రయ క్షేత్రాన్ని ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, బోధన్ సమీపంలోని సాలురా ఆశ్రమ నిర్వాహకులు సంగు మహారాజ్ గురువారం తమ శిష్యులతో కలిసి సందర్శించారు. ప్రకృతి ఒడిలో నెలకొని ఉన్న ఈ త్రిశక్తి పీఠంలో పీఠాధిపతి, ఆధ్యాత్మిక గురువు శ్రీ ఆదిత్య పరశ్రీ స్వామీజీని సంగు



మహారాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారి మధ్య వీరశైవ లింగాయత్ సంప్రదాయం, హిందూ ధర్మ పరిరక్షణపై సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. జంగముడు నడయాడే దేవుడని, బసవేశ్వర మహారాజ్ కులమత భేదాలు లేకుండా అందరికీ లింగధారణ చేసి భక్తి ముక్తి మార్గాలను చూపారని సంగు మహారాజ్ వివరించారు. స్వామిని కలిసిన వారిలో నిజామాబాద్ కు చెందిన శివకుమార్ అప్ప, బున్ని రాజు, సాలూరకు చెందిన స్వామి గౌడ్ ఉన్నారు.

## బాసర అమ్మవారి హుండీ ఆదాయం ఒక కోటి ఆరు లక్షలు

బాసర, జూలై 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించారు. గత 49 రోజులకు సంబంధించిన ఆలయ హుండీలను దేవస్థాన పరిపాలనా అధికారులు, పోలీసు సిబ్బంది సమక్షంలో తెరిచి కానుకలను లెక్కించారు. ఈ 49 రోజుల కాలానికి గాను అమ్మవారికి అక్షరాలా ఒక కోటి ఆరు లక్షల



నలభై ఐదు వేల మూడు వందల యాభై తొమ్మిది రూపాయల (1,06,45,359) భారీ నగదు ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు అధికారికంగా వెల్లడించారు. నగదుతో పాటు భక్తులు అమ్మవారికి సమర్పించుకున్న కానుకల్లో 78 గ్రాముల మిశ్రమ బంగారం, 4 కిలోల మిశ్రమ వెండి లభ్యమయ్యాయని తెలిపారు. వీటితో పాటు వివిధ దేశాలకు చెందిన 17 విదేశీ కరెన్సీ నోట్లు కూడా హుండీలో లభించినట్లు వివరించారు. ఆలయ ఈఓ కే అంజని దేవి పర్యవేక్షణలో జరిగిన ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ శాఖ నిర్మల్ పరిశీలకుడు ఆర్ రవికిషన్, సహాయ కార్యనిర్వహణాధికారి జీ గంగా శ్రీనివాస్, దేవస్థాన పర్యవేక్షకులు శివరాజ్, సంజీవ్ రావు, వైదిక సిబ్బంది, టీజీబీ బ్యాంక్ సిబ్బంది, బాసర పోలీసు సిబ్బంది, వాగ్దేవి సొసైటీ సభ్యులు, రాజరాజేశ్వర స్వామి సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

## ముధోల్ ఎస్సీ బాలికల హాస్టల్ విద్యార్థినులకు ఊరట..

# నూతన భవనానికి మార్పు

ముధోల్, జూలై 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహ విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు సానుకూలంగా స్పందించారు. త్వరలోనే హాస్టల్‌ను సకల మౌలిక సదుపాయాలు కలిగిన నూతన భవనానికి తరలిస్తామని సహాయ సంక్షేమ అధికారి (ఏఎస్‌డబ్ల్యూఓ) హామీ ఇచ్చారు. వసతి గృహంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐపీఎస్‌యూ) జిల్లా కార్యదర్శి



గడపాలి పరమేష్ ఆధ్వర్యంలో గురువారం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా పాత హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థినులను ప్రైవేట్ భవనంలో ఉంచారని, అక్కడ మరుగుదొడ్లు స్నానాల గదులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్పందించిన అధికారి, త్వరలోనే అన్ని వసతులు కలిగిన భవనానికి మారుస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థినులు ఊరట చెందారు.

# ముధోల్ ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీడీఓ

ముధోల్, జూలై 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) లవ్‌కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందుతున్న ఆహార నాణ్యత, పరిశుభ్రత, వసతులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి, మెనూ ప్రకారం భోజనం సక్రమంగా అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నిరంతరం నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని వార్డెన్‌ను ఆదేశించారు.



అనంతరం వంటగదిని, టాయిలెట్లను పరిశీలించి, వర్షాకాలం నేపథ్యంలో పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచడంతో పాటు క్రమం తప్పకుండా శానిటైజేషన్ నిర్వహించాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. తనిఖీలో హాస్టల్ వార్డెన్ గోదావరి, సిబ్బంది పాల్గొన్నారు.

## లక్ష్యానికి మించి ఆయిల్ పామ్ పంటలను సాగు చేయాలి:

నిర్మల్, జూలై 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లాలో నిర్దేశించిన లక్ష్యానికి మించి ఆయిల్ పామ్ పంటలను సాగు చేసేలా వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఆయిల్ పామ్ పంటల విస్తీర్ణం పెంపుదలపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఈ ఏడాది నిర్దేశించిన 1,600 ఎకరాలకు మించి ఆయిల్ పామ్



సాగు జరిగేలా చొరవ చూపాలని, ఆ దిశగా రైతులను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు మిగతా సాంప్రదాయ పంటలకు, ఆయిల్ పామ్ పంటలు పండిస్తే కలిగే ఆర్థిక ప్రయోజనాలకు గల వ్యత్యాసాలను వివరించాలన్నారు. పెట్టుబడి, శ్రమ, సాగునీటి పొదుపు, రాబడి వంటి లాభాలను రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మండలాల వారీగా అధికారులు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, అధికారులు అంజిప్రసాద్, రమణ పాల్గొన్నారు.

# నేటి దిశ కమిటీ సమావేశానికి అన్ని నివేదికలు సిద్ధం చేయాలి: కలెక్టర్




నిర్మల్, జూలై 2 (తెలంగాణ వెన్నెల వాక్కు): జిల్లాలో నేడు (శుక్రవారం) జరగబోయే ప్రతిష్టాత్మక 'దిశ' కమిటీ సమావేశానికి సంబంధించి అన్ని శాఖల అధికారులు తమ నివేదికలను సంపూర్ణంగా సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో కలెక్టర్ దిశ కమిటీ సమావేశ నిర్వహణ, ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ముందస్తు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జిల్లాలో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతి నివేదికలను పక్కాగా రూపొందించాలన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు అడిగే ప్రశ్నలకు సరైన సమాధానాలు, గణాంకాలతో కూడిన నివేదికలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ ముందస్తు సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్ తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాసర ఆలయ దొంగతనం కేసు ఛేదన..

## .10 రోజుల్లోనే ముగ్గురు అరెస్ట్, వెండి కిరీటం స్వాధీనం

నిర్మల్, జూలై 2 (తెలంగాణ వెన్నెల వాక్కు):
బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో ఇటీవల జరిగిన సంచలనాత్మక దొంగతనం కేసును నిర్మల్ జిల్లా పోలీసులు కేవలం పది రోజుల్లోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఛేదించారు. వేగవంతమైన దర్యాప్తుతో ఇద్దరు అంతర్‌జిల్లా దొంగలతో పాటు దొంగిలించిన సొత్తును స్వీకరించిన మరో వ్యక్తిని అరెస్ట్ చేసి, సుమారు 1.48 కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం, జూన్ 22న రాత్రి ఆలయంలోకి చొరబడిన నిందితులు గేటు తాళాలు పగులగొట్టి అమ్మవారి వెండి కిరీటం, హుండీని దొంగిలించారు. అనంతరం హుండీలోని నగదును తీసుకుని, వెండి కిరీటాన్ని రెండు భాగాలుగా విడదీసి అక్కడి నుంచి పరారయ్యారు. ఘటన అనంతరం జిల్లా పోలీసులు ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తెలంగాణతో పాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, విశ్వసనీయ సమాచారం ఆధారంగా దర్యాప్తు కొనసాగించిన పోలీసులు, కాచిగూడ--నాగర్‌సోల్ రైలులో ప్రయాణిస్తున్న ముగ్గురిని బాసర రైల్వే స్టేషన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి అమ్మవారి వెండి




కిరీటం, వెండి పట్టీతో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల అభినందిస్తూ నగదు రివార్డులు ప్రకటించారు.

# దస్తూరాబాద్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ




దస్తూరాబాద్, జూలై 2 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పోలీసు అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని నిర్మల్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ జి. జానకి షర్మిల ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆమె దస్తూరాబాద్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ నిర్వహణ, శాంతిభద్రతలు, నేరాల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతిని సమగ్రంగా పరిశీలించారు. పోలీసు సిబ్బంది సమర్పించిన గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం స్టేషన్ ఆవరణ, మాల్ఖానా, ఆయుధాగారం, సీసీ కెమెరాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. స్టేషన్ పరిధిలో గంజాయి, గుడుంబా, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణలో విలేజ్ పోలీస్ ఆఫీసర్ల (వీపీఓ) పాత్ర అత్యంత కీలకమని, గ్రామస్థాయిలో సమాచార వ్యవస్థను మరింత పటిష్టం చేయాలన్నారు. డయల్-100కు వచ్చే ప్రతి కాల్‌పై తక్షణమే స్పందించాలని సూచించారు.

# పాఠశాలల్లో పడకేసిన పారిశుద్ధ్యం..

## మూత్రశాలలు లేక విద్యార్థినుల అవస్థలు

నిర్మల్, జూలై 2 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కరువై విద్యార్థులు, ముఖ్యంగా విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చాత్ర యువ సంఘర్షణ సమితి (సీవైఎస్ఎస్), యూఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్నను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శీతల్కర్ అరవింద్, యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నవీన్ మాట్లాడుతూ, నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో 250 మంది విద్యార్థినులకు కేవలం ఒకే ఒక్క బాత్రూమ్ ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. బాత్రూమ్‌లకు తలుపులు



లేకపోవడం, కనీస గోప్యత కరువవడంతో విద్యార్థినులు బహిరంగ ప్రదేశాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బాలికలు ప్రతి నెల రుతుక్రమ సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ పాఠశాలలకు రావడానికే వెనుకంజ వేస్తున్నారన్నారు. “మన ఊరు -- మన బడి” పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, అత్యంత అవసరమైన మరుగుదొడ్లను నిర్మించడంలో విఫలమైందన్నారు. విద్యాశాఖ వెంటనే స్పందించి ప్రత్యేక సర్వే నిర్వహించి, అన్ని పాఠశాలల్లో బాలికలకు, బాలురకు వేర్వేరుగా తగిన సంఖ్యలో మరుగుదొడ్లు నిర్మించాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# ప్రముఖ వైద్యులు డాక్టర్ నీలిమ వేణుగోపాలకృష్ణ దంపతులకు ఘన సన్మానం

నిర్మల్, జూలై 2 (తెలంగాణ వెన్నెల వాక్కు):
జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నిర్మల్ శాఖ, జిల్లా డయాగ్నొస్టిక్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ నీలిమ, డాక్టర్ వేణుగోపాలకృష్ణ దంపతులను ఘనంగా సన్మానించారు. ఖానాపూర్, ఉట్నూర్, ఆదిలాబాద్ ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్‌గా విశేష సేవలు అందించిన డాక్టర్ వేణుగోపాలకృష్ణ సేవలను గుర్తించి ఇప్పటికే పలు జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు లభించాయి. అంతేకాకుండా కళారంగంలో ‘ప్రేమతో నాన్న’ చిత్రానికి నంది పురస్కారం అందుకోగా, ఇటీవల నిజామాబాద్ వైద్య కళాశాలలో ఎండీ వైద్య విద్యలో రాష్ట్ర స్థాయి గౌరవం పొందారు. ఈ నేపథ్యంలో నిర్మల్ లోని నీలిమ హాస్పిటల్ లో జరిగిన కార్యక్రమంలో వైద్య దంపతులను శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య శాఖ అధికారి (డీహెచ్ఎంఓ) డాక్టర్ రాజేందర్, ఐఎంఏ చైర్మన్ డాక్టర్ చక్రధర్, అధ్యక్షులు డాక్టర్ మురళీధర్, రాష్ట్ర సభ్యులు డాక్టర్ దామోదర్ రాములు, డాక్టర్ రమేష్, డాక్టర్ రవి, ఎన్డీఏ సభ్యులు సంతోష్, నేరెళ్ల హనుమంతు పాల్గొన్నారు.



# జూలై 10న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్

## వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు

నిర్మల్ ఖిల్లా, జూలై 2 (తెలంగాణ వెన్నెల వాక్కు):
రాష్ట్రంలో కుప్పకూలుతున్న ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవడానికి, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల జులై 10వ తేదీ శుక్రవారం నాడు చేపట్టే రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ ను విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐపీఎస్‌యూ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు, వాటిలో ఉన్న మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు అన్ని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో కూడా నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని




డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న ఇష్టారాజ్యపు ఫీజుల దోపిడీని అరికట్టడానికి తక్షణమే కఠినమైన ‘ఫీజు నియంత్రణ చట్టం’ తీసుకురావాలన్నారు. రాష్ట్ర విద్యా రంగానికి దిక్సూచిగా ఉండేందుకు ప్రత్యేకంగా ‘విద్యాశాఖ మంత్రి’ని కేటాయించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను, పాఠశాలల పరిశుభ్రత కోసం స్కావెంజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. బంద్‌కు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

# మంత్రి జూపల్లిని కలిసిన కీర్గుల్ (కే) గ్రామస్థులు..

## రోడ్డు సమస్యలపై వినతి

బాసర, జూలై 2 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా బాసర మండలంలోని కీర్గుల్ (కే) గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామస్థులు గురువారం హైదరాబాదులోని ప్రజాభవన్ లో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎదుర్కొంటున్న పలు సమస్యలతో పాటు ప్రధానంగా గ్రామ మరమ్మత్తు రోడ్ల గురించి మంత్రికి వివరంగా వివరించారు. కీర్గుల్ (కే) గ్రామం నుండి కీర్గుల్ (బి), బాసర మీదుగా నిజామాబాద్, భైంసా, ధర్మాబాద్ పట్టణాలను కలిపే ప్రధాన రోడ్డు మార్గాన్ని త్వరితగతిన నిర్మించాలని కోరారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో వేసిన తాత్కాలిక రోడ్డు రాకపోకలకు వీలుగా లేనందున, నిత్యం ప్రయాణించే ఈ రోడ్డు మార్గాన్ని బీటీ రోడ్డుగా వెడల్పు చేసి పలు గ్రామాల ప్రజల రవాణా ఇబ్బందులను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.



# వరద ముంపు గ్రామాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ

దస్తూరాబాద్, జూలై 2 (తెలంగాణ వెన్నెల వాక్కు):
గత సంవత్సరం సంభవించిన గోదావరి వరదల కారణంగా తీవ్ర ముంపునకు గురైన దస్తూరాబాద్ మండలంలోని గోడ్‌సీరియల్ గ్రామాన్ని నిర్మల్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ జి. జానకి షర్మిల గురువారం సందర్శించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన ఎస్పీ, గ్రామ పెద్దలతో ముఖాముఖి మాట్లాడి గత ఏడాది గోదావరి వరదల సమయంలో ఎదురైన ఇబ్బందులు, ఆస్తి నష్టాలు, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో భారీ వర్షాలు, గోదావరి వరదలు సంభవించే అవకాశాల దృష్ట్యా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వరదల సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అవసరమైన అన్ని రక్షణ ఏర్పాట్లు ముందుగానే సిద్ధంగా ఉంచాలని, ప్రమాదకర ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సహాయక చర్యలు చేపట్టేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజలు కూడా అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా



ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, సంబంధిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్, దస్తూరాబాద్ ఎస్ఐ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com